అన్నదాతల ఆశలు ఆవిరి

- రబీలో అందని పెట్టుబడి సాయం
- అదనంగా బీమా భారం
- డెల్టా రైతుల్లో నిరాశ
- కూటమి ప్రభుత్వంపై రైతుల మండిపాటు

కూటమి ప్రభుత్వం అన్నదాతలను చిన్నచూపు చూస్తోంది. వారి గురించి పట్టించుకోవడం లేదు. రబీ సీజన్‌లో పెట్టుబడి సాయం అందుతుందని భావించిన అన్నదాతలకు నిరాశే మిగిలింది. పైగా బీమా భారం అదనంగా మోపింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి అండగా నిలబడగా నేటి చంద్రబాబు సర్కారు మోసం చేస్తోంది.


కొడవలూరు సమీపంలో నాట్లు వేస్తున్న దృశ్యం

కొడవలూరు: కోవూరు నియోజకవర్గం డెల్టా ప్రాంతం. ఇక్కడ వరిసాగు పైనే రైతులు ఆధారపడ్డారు. రబీ సీజన్‌లో లక్ష ఎకరాల్లో వరి సాగు చేస్తారు. రైతులంతా ప్రస్తుతం వరి నాట్లు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందిస్తానని వెల్లడించింది. కానీ ఇప్పటి వరకు చిల్లిగవ్వ అందలేదు. నార్లు దశ దాటి నాట్లు వేసుకోవడం దాదాపు పూర్తి కావచ్చింది. కానీ ఇప్పటి వరకూ సాయంపై నోరు మెదపలేదు.

భారం పడి..

ప్రస్తుతం వ్యవసాయ పెట్టుబడి బాగా పెరిగింది. నాట్లు పూర్తయ్యే వరకూ రైతులు భారం భరించాల్సి ఉంది. ఈ సమయంలో ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించి ఉంటే కొంత ఊరటగా ఉండేది. కానీ ఆ ఊసే ఎత్తడం లేదు. దీంతో గత్యంతరం లేక పంట వదులుకోలేక అప్పులు చేసి మరీ నాట్లు పూర్తి చేసుకుంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు ఏడాదికి రూ.13.500ల చొప్పున సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేశారు. కూటమి ప్రభుత్వం రైతులకు రబీలో నామం పెట్టడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇలా కూడా..


అన్నదాతలకు పెట్టుబడి సాయం నిలిపేసి కడుపు మండించిన కూటమి ప్రభుత్వం అదనంగా బీమా భారం మోపింది. గడిచిన ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల తరఫున బీమా ప్రీమియం చెల్లించింది. ఇప్పుడు అన్నదాతలే ప్రీమియం చెల్లించుకోవల్సి రావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్యాంక్‌లో రుణం ఉన్న వారికి అప్పు పూర్తిగా చెల్లిస్తే తప్ప బీమా కట్టుకోలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా సింహ భాగం రైతులు పంట బీమాకు దూరమవుతున్నారు. పెట్టుబడి సాయం అందించకపోగా బీమా భారం మోపడమేమిటని ఆగ్రహం చెందుతున్నారు.

నట్టేట ముంచారు



కూటమి ప్రభుత్వం రైతులను నిలువునా ముంచింది. పెట్టుబడి సాయం అందితే ఊరటనిస్తుందని ఆశలు పెట్టుకున్నాం. కానీ నాట్లు పూర్తి చేసుకున్నా కూడా ప్రభుత్వం ఆ ఊసే లేదు. ఇప్పటి వరకూ పెట్టుబడి సాయం అందించకపోవడం రైతులను మోసం చేయడమే. అన్నం పెట్టే అన్నదాతను చిన్నచూపు చూసి సాయం అందించకపోవడం దారుణం. రైతులను విస్మరించిన ప్రభుత్వాలు మూల్యం చెల్లించుకోక తప్పదు.

– జి.వెంకటకృష్ణారెడ్డి, రైతు, మిక్కిలింపేట, కొడవలూరు మండలం


రబీ సాగుకు నార్లు పోసుకున్న రైతులు

అదనపు భారం మోపడమేమిటి?



పెట్టుబడి సాయం అందించకపోగా అదనంగా బీమా భారం మోపడాన్ని చూస్తే కూటమి ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతోంది. బీమా ప్రీమియం బ్యాంక్‌లో రుణం తీసుకున్న వారికి బ్యాంక్ ద్వారానే చెల్లించాల్సి ఉంది. ఇందులో చాలా ఇబ్బందులున్నాయి. ఇవేమీ పట్టించుకోకుండా రైతులే బీమా కట్టుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడం దారుణం. ఈ విధానం వల్ల చాలా మంది రైతులు పంట బీమాకు దూరమవుతున్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి. గత ఐదేళ్లపాటు ఉన్న పద్ధతినే అమలు చేయాలి.

– కె.సుబ్బరామిరెడ్డి, రైతు, మానేగుంటపాడు, కొడవలూరు మండలం

క్లుప్తంగా

భగవద్గీత పోటీల్లో ప్రథమ స్థానం


బహుమతి అందుకుంటున్న ఈశాంత్‌రెడ్డి


ఇందుకూరుపేట: వైఎస్సార్ జిల్లాలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి భగవద్గీత పఠన పోటీల్లో కొత్తూరులోని జీవీకే చిన్మయ విద్యాలయంలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి వై.ఈశాంత్‌రెడ్డి ప్రథమ స్థానం సాధించినట్లు కరస్పాండెంట్ హరిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈశాంత్‌రెడ్డిని టీచర్లు అభినందించారు.

ఘాటెక్కిన ఉల్లి ధరలు


ఉల్లిపాయలు

పొదలకూరు : నిన్నటి వరకు టమోటాల ధరల మోతతో సతమతమైన ప్రజలు ఇప్పుడు ఉల్లిపాయల ధరలతో ఇబ్బందులు పడుతున్నారు. మళ్లీ ఉల్లిపాయల ధరలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నట్లు వ్యాపారులు వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో ఉల్లిపాయలు రూ.75 విక్రయాలు జరుగుతున్నాయి. రోజు రోజుకు పెరుగుతున్నాయని, రూ.100కు చేరుకునే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. రాష్ట్రంలో ఉల్లిపాయల సాగు తగ్గిపోవడం, డిమాండ్‌కు సరిపడా దిగుబడి లేకపోవడంతో ఉల్లిపాయల ధరలు దిగిరావడం లేదు. మరికొంత కాలం ధరలు ఇలాగే నిలకడగా ఉండే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

వెంకయ్యస్వామి ఆశ్రమ కమిటీ వైస్ చైర్మన్‌గా జస్టిస్ కేఎస్ అప్పారావు


పదవీ ప్రమాణ స్వీకారం చేస్తున్న జస్టిస్ కేఎస్ అప్పారావు


జస్టిస్ అప్పారావు

వెంకటాచలం: జిల్లాలో ప్రసిద్ధ భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమ కమిటీ వైస్ చైర్మన్‌గా ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన జస్టిస్ కేఎస్ అప్పారావు నియమితులయ్యారని ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి.బాలసుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ఆశ్రమ కమిటీ వైస్ చైర్మన్‌గా ఉన్న నాగారెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆరోగ్య కారణాలతో రాజీనామా చేయడంతో జస్టిస్ కేఎస్ అప్పారావు నియమించడంతో సోమవారం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు.

విశ్వనాథుడికి రుద్రాభిషేకం


ప్రత్యేక అలంకరణలో విశ్వనాథుడు

మనుబోలు: మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా చెర్లోపల్లి రైల్వే గేటు సమీపంలో ఉన్న విశ్వనాథస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో విశ్వనాథుడికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సంగమేశ్వరాలయం, విష్ణాలయాల్లో కూడా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

ధనుర్మాస పూజలు ప్రారంభం

పొదలకూరు : పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం నుంచి ధనుర్మాస పూజలను ప్రారంభించారు. తెల్లవారుజామున భక్తులు గోత్రనామాలతో ప్రత్యేక పూజలను నిర్వహించారు. వెంకటేశ్వరస్వామికి ధనుర్మాసం ఎంతో ప్రీతిపాత్రం కావడంతో ప్రతినిత్యం తిరుప్పావై ఉంటుందని దేవస్థానం నిర్వాహకులు వెల్లడించారు. భక్తులు రూ.500 చెల్లిస్తే ధనుర్మాసంలో వారి గోత్రనామాలతో పూజలను నిర్వహించడం జరుగుతుందన్నారు.

నేడు జాతీయ పెన్షనర్ల దినోత్సవం

పొదలకూరు : పట్టణంలోని పెన్షనర్ల భవనంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు జాతీయ ప్రభుత్వ పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తామని ఆ సంఘం అధ్యక్షుడు కే కోటేశ్వరరావు సోమవారం తెలిపారు. సీనియర్ పెన్షనర్లకు సన్మానం నిర్వహిస్తామన్నారు. మండలంలో ఉన్న విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు హాజరు కావాల్సిందిగా కోరారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికలు రేపు

కోవూరు: హ్యాండ్‌బాల్ పోటీలకు సంబంధించి జిల్లా స్థాయి సీనియర్ ఉమెన్స్ జట్టు ఎంపికలను బుధవారం పాటూరు జిల్లా ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామని పీడీ భీమతాటి వెంకటరమణయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 94903 20435 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రెవరెండ్ జర్మియాకు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న రెవరెండ్ జర్మియా

ముత్తుకూరు: మండలంలోని నేలటూరుకు చెందిన రెవరెండ్ జీ జెర్మియాను సోమవారం గౌరవ డాక్టరేట్ వరించింది. అమెరికాకు చెందిన అంతర్జాతీయ క్రైస్తవ సంస్థ అయిన 'నాటా' ద్వారా ఆయనకు ఈ గౌరవం లభించింది. 25 ఏళ్లకుపైగా సేవ, అంకిత భావంతో పనిచేస్తుందుకు గుర్తించి నెల్లూరు పడారుపల్లిలోని ఎయిమ్స్ చర్చిలో ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

- వ్యవసాయశాఖ ఏడీఏ రాజ్‌కుమార్


నరుకూరు సెంటర్‌లోని ఎరువుల దుకాణంలో విక్రయాలను పరిశీలిస్తున్న ఏడీఏ రాజ్‌కుమార్

తోటపల్లిగూడూరు: ఎరువుల దుకాణ డీలర్లు రైతులకు అందించాల్సిన ఎరువుల విషయంలో కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు కఠిన చర్యలు తీసుకొంటామని ఇందుకూరుపేట ఏడీఏ డాక్టర్ రాజ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని నరుకూరు సెంటర్‌లోని పలు ఎరువుల, పురుగు మందుల దుకాణాల్లో సోమవారం తనిఖీలు చేపట్టారు. పలు షాపులను తనిఖీ చేసిన విక్రయాలు, స్టాక్ రిజిస్టర్స్ పరిశీలించి ఎమ్మార్పీ ధరల ఆరా తీశారు. ఏడీఏ డాక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి సొసైటీలు, ప్రైవేట్ దుకాణాల ద్వారా రైతులకు ఎరువులను అందిస్తున్నామన్నారు. ఎరువు కొరత లేకుండా అన్ని రకాల ఎరువులను పూర్తి స్థాయిలో రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఎక్కడైనా రైతులకు ఎరువులను అందించకుండా కృత్రిమ కొరత సృష్టించినా, కొనుగోలు విషయంలో మెలిక పెట్టినా సహించేది లేదన్నారు. ఏడీఏ వెంట ఏఓ శిరీషారాణి, ఎరువుల దుకాణాల డీలర్ల అసోసియేషన్ మండల అధ్యక్షుడు సురేంద్రరెడ్డి తదితరులు ఉన్నారు.

అగ్రిగోల్డ్ ప్లాట్ల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి


ఆక్రమణకు గురైన అగ్రిగోల్డ్ భూముల వద్ద అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

తోటపల్లిగూడూరు: మండలంలోని రావూరివారి కండ్రిగ–చిన్నచెరుకూరు రహదారిలో ఉన్న అగ్రిగోల్డ్ ప్లాట్ల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు విన్నవించారు. అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన సోమవారం ఫర్చిన్ సింహపురి వెంచర్‌ను పరిశీలించారు. తిరుపతిరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన వెంచర్లతో పాటు 2008లో అగ్రిగోల్డ్ సంస్థ ఇక్కడ ఈ వెంచర్‌ను ఏర్పాటు చేసిందన్నారు. వెంచర్‌లోని ప్లాట్లను సైతం ఇప్పటికే విక్రయించినట్లు తెలిపారు. అయితే ఈ వెంచర్ సీఐడీ స్వాధీనంలో ఉందన్నారు. ఈ ప్లాట్లను కొనుగోలుదారులకు సైతం ఎలాంటి క్రయ విక్రయాలకు అవకాశం లేదన్నారు. అయితే ఈ వెంచర్‌లో రహదారి ఆనుకుని దాదాపు 60 ప్లాట్లను స్థానికులు ఆక్రమించుకుని రాళ్లను పీకివేసి వ్యవసాయం సాగుకు సిద్ధమయ్యారన్నారు. ప్రజా అవసరాల కోసం వదిలిన రెండు ఎకరాల స్థలాన్ని సైతం ఆక్రమించుకున్నారన్నారు. అధికారులు స్పందించి ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శంకరయ్య, జిల్లా సెక్రటరీ రామదాసు, సభ్యులు సుబ్రహ్మణ్యం, మహేష్, కృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక నేరగాళ్లను అరికట్టాలి


మాట్లాడుతున్న ఎస్సై హనీఫ్

పొదలకూరు : కొత్తకొత్త మార్గాల్లో ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న మోసగాళ్లను అరికట్టాలంటే ప్రజల సహకారం అవసరమని పొదలకూరు ఎస్సై ఎస్‌కే హనీఫ్ తెలిపారు. స్థానిక విజ్ఞాన్ జూనియర్ కాలేజీలో ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక అక్షరాస్యత, పొదుపు, సైబర్ నేరాలపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ గుర్తింపు పొందిన సంస్థల్లో మాత్రమే రుణాలు తీసుకోవాలని సూచించారు. లోన్ యాప్‌ల బారిన పడి అధిక వడ్డీలను చెల్లించలేక యువకులు చాలా మంది ఆత్మహత్యలు చేసుకున్నట్లు చెప్పారు. పొదలకూరు బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ జీ రాజేష్ మాట్లాడుతూ బ్యాంకు సేవలు, రుణాల వివరాలను వెల్లడించారు. బ్యాంకు ఉద్యోగులమని అపరిచితులు వస్తే పోలీసుల దృష్టికి తీసుకు వెళ్లాల్సిందిగా తెలిపారు. ఓటీపీ, డెబిట్ కార్డు నంబర్లు అడిగితే చెప్పొద్దన్నారు. బ్యాంకులు వ్యక్తిగత గోప్యత గురించి ఎన్నడూ ప్రశ్నించవన్నారు. ఈ సదస్సులో బ్యాంకు జాయింట్ మేనేజర్ అశోక్, ట్రీస్ సంస్థ కార్యదర్శి షేక్ అహ్మద్, కాలేజీ ప్రిన్సిపల్ జీఎస్ రెడ్డి, ఎ.సుబ్బారావు, ఇన్‌చార్జి కృష్ణ, రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో విద్యార్థులకు ప్రతిభా పోటీలు


ప్రతిభ చూపిన విద్యార్థులతో వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు తదితరులు

వెంకటాచలం: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా కాకుటూరులోని వీఎస్‌యూలో సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. వక్తృత్వ, వ్యాసరచన, డిబెట్ తదితర పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ ఉదయ్‌శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వినతులిచ్చినా ఉపయోగం లేదని..

- నామమాత్రంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

బుచ్చిరెడ్డిపాళెం: ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రభుత్వం నామమాత్రంగా నిర్వహిస్తోందని విమర్శలున్నాయి. బుచ్చిరెడ్డిపాళెం మండలంలో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు విసుగెత్తివినతిపత్రాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. సోమవారం కేవలం ఒక అర్జీ వచ్చినట్లు చెబుతున్నారు. అది కూడా నగర పంచాయతీకి సంబంధించిన డంపింగ్ యార్డును మరో ప్రాంతానికి తరలించాలని అధికార పార్టీ నాయకులు స్థానికుల చేత ఫిర్యాదు ఇప్పించినట్లు తెలిసింది. ఈ విషయమై తహసీల్దార్ వెంకటేశ్వర్లును వివరణ కోరగా మండల పరిధిలోని ఎన్టీఆర్ నగర్ సమీపంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును తరలించాలంటూ అక్కడి వాసులు ఫిర్యాదు చేశారని, దీనిపై కమిషనర్‌ను సంప్రదించినట్లు పేర్కొన్నారు. ఇంకెలాంటి వినతిపత్రాలు రాలేదని వెల్లడించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

మనుబోలు: సేవానాథం ట్రస్ట్ ఫౌండర్ మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ట్రస్ట్ నిర్వాహకులు సోమవారం రాత్రి మనుబోలులో వెయ్యి మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పేదలందరికి అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు పార్టీల నాయకులు మాట్లాడుతూ శ్రీనాథ్‌రెడ్డి సేవానాథం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటికే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ భవన నిర్మాణం, యువతకు క్రీడా ఈవెంట్ల నిర్వహణ, ప్రమాదాల్లో చనిపోయిన వారికి ఆర్థిక సాయం అందించడం వంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ముంగర రవీందర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, చల్లా నవకోటి, టీడీపీ నాయకులు ఎంవీబీ రెడ్డి, దండు చంద్రశేఖర్‌రెడ్డి, చేరెడ్డి రామిరెడ్డి, సీపీఎం నాయకుడు కటికాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో సీపీఎం రాష్ట్ర మహాసభలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వచ్చే ఫిబ్రవరి ఒకటి నుంచి 3వ తేదీ వరకు నెల్లూరులో సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం సాయంత్రం నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, ట్రూ అప్ చార్జీల పేరుతో వేల కోట్ల రూపాయలను ప్రజలపై భారం మోపడం, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం లాంటి నిర్ణయాలు తీసుకుందన్నారు. వీటిని వ్యతిరేకిస్తూ ఇంటింటి ప్రచారం చేసి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేలా పార్టీ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావు, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, ఇంకా మస్తాన్‌బీ, సూర్యనారాయణ, కాయం శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎరువుల ధరలు పెంచడం దారుణం

- వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటశేషయ్య


ఏఓ హరికరుణాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వెంకటాచలం: రైతులపై ఆర్థికభారం పెంచుతూ ఎరువుల ధరలు పెంచడం దారుణమని, ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి సోమవారం వెంకటాచలం ఏఓ హరికరుణాకర్‌రెడ్డికి ఎరువుల అధిక ధరలకు అమ్మకాలపై వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన ఎరువులను రైతులకు ఎమ్మార్పీ ధరలకు పంపిణీ చేసినట్లు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు పంపిణీ చేయకపోవడంతో, ప్రైవేట్ డీలర్లు రైతులకు అధిక ధరలకు అమ్మకాలు చేస్తున్నారన్నారు. యూరియా, డీఏపీ డిమాండ్ ఉందని చెప్పి, గుళికలు, పురుగు మందులు కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామని ఆంక్షలు విధిస్తున్నారని చెప్పారు. యూరియా ఎమ్మార్పీ ధర రూ.266 ఉండగా, వ్యాపారులు రూ.300 నుంచి రూ.350 వరకు అమ్ముతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మందా కవిత, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు కొణిదెన విజయభాస్కర్‌నాయుడు, కడివేటి శివ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో గిరిజన కాలనీ


ఈ రహదారిపై రాకపోకలు ఎలా?

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని 20వ వార్డులో ఉన్న రామచంద్రాపురం గిరిజన కాలనీ సమస్యల వలయంలో చిక్కుకుంది. ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువలు లేకపోవడంతోపాటు రోడ్లు దారుణంగా ఉండటం గిరిజనుల పాలిట శాపంగా మారింది. డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని చెప్పిన నగర పంచాయతీ అధికారులు ఇటు వైపే చూడటం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ వార్డులో ఎక్కువగా గిరిజనులు, దళితులు, వెనుకబడిన తరగతుల వారే నివాసం ఉంటున్నారు. గత వారం కురిసిన వర్షానికి నీరు నిల్వ చేరింది. యంత్రాంగం పట్టించుకోకపోవడంతో స్థానికులే కాలువ తవ్వి నీరు బయటకు వెళ్లేందుకు మార్గం ఏర్పాటు చేసుకున్నారు. దోమలు బెడద అధికం కావడంతో ఈ సమస్య గురించి ఎవరికి చెప్పాలో తెలియక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం కేవలం పట్టణ ప్రాంతాల్లోనే తూతూమంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. గత వారం జరిగిన నగర పంచాయతీ సర్వసభ్య సమావేశంలో ఆ ప్రాంత కౌన్సిలర్ చలంచర్ల శ్రీదేవి సమస్యలపై ఫిర్యాదు చేశారు. అయినా అటువైపు కన్నెత్తి చూడలేదు. ఇంకా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యంలో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తక్షణం మురుగునీటి కాలువ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


ఇలా ఉంటే మురుగునీరు వెళ్లేదెలా?